ఆ మూలమలుపులు డేంజర్

వై జంక్షన్లలో పెరుగుతున్న ప్రమాదాలు

వాహనాల సంఖ్య పెరిగినా మారని రోడ్లు



నటరాజ్‌నగర్ వై జంక్షన్ వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు



ఆయుర్వేద ఆస్పత్రి వద్ద వై జంక్షన్



హేమావతినగర్ చౌరస్తాలో అడ్డదిడ్డంగా వెళుతున్న వాహనాలు

ఎర్రగడ్డ, మే 18 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడో దశాబ్దాల క్రితం నిర్మించిన వై జంక్షన్‌లు, చౌరస్తాలను ఇప్పటికీ అదేవిధంగా కొనసాగిస్తుండడంతో వేల సంఖ్యలో పెరిగిన వాహనాలకు అవి అనుకూలంగా లేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు వై జంక్షన్‌లు, చౌరస్తాల్లో ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. ఆ మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. అటు వైపు నుంచి వస్తున్న వాహనాలు కనిపించకుండా మలుపులను ఏర్పాటు చేయడం వల్ల ఈ జంక్షన్‌లలో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. డివిజన్‌లోని నటరాజ్‌నగర్ వైజంక్షన్, హేమావతినగర్ చౌరస్తా, డాన్‌బాస్కో స్కూల్ వై జంక్షన్, ఆయుర్వేద ఆస్పత్రి వై జంక్షన్లు నిత్యం ప్రమాదాలకు తావిస్తున్నాయి.

పెరుగుతున్న ప్రమాదాలు

ఎర్రగడ్డ నుంచి బోరబండ, మోతీనగర్, మూసాపేట్‌కు వెళ్లాలంటే వేలాది వాహనాలు ఈ చౌరస్తాలు, వై జంక్షన్‌ల మీదుగానే వెళ్లాల్సి ఉంటోంది. ఎర్రగడ్డ నుంచి బోరబండ వెళ్లేదారిలో మొదటగా ఆయుర్వేద ఆస్పత్రి వైజంక్షన్ వద్ద ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ఏజీ కాలనీ నుంచి యూసుఫ్‌గూడ వెళ్లాల్సిన వాహనాలు కుడివైపు మలుపుతిరిగే సమయంలో ఈఎస్‌ఐ నుంచి వచ్చే వాహనాలతో ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. యుసుఫ్‌గూడ నుంచి వచ్చే వాహనాలు ఈఎస్‌ఐ వైపు మలుపు తిప్పుకునే ప్రయత్నంలో బోరబండ ఏజీ కాలనీనుంచి వచ్చే వాహనాలతో ఢీకొనే ప్రమాదాలు ఎక్కువవుతున్నాయి. ఈ వైజంక్షన్లో రోజుకు రెండు నుంచి మూడు ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. అనంతరం నటరాజ్‌నగర్ వైజంక్షన్ మరీ ప్రమాదకరంగా మారింది. మలుపు తిప్పుకునే సమయంలో అటు నుంచి వచ్చే వాహనాలు అసలు కనిపించవు. ఈ ప్రాంతంలో గతంలో వాటర్ ట్యాంకర్ ఢీకొని స్కూల్ విద్యార్థి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. అంతేకాకుండా నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. ఎర్రగడ్డ జాతీయ రహదారి నుంచి ప్రేమ్ నగర్ మీదుగా బోరబండ వెళ్లే రోడ్డులో డాన్‌బాస్కో స్కూల్ వైజంక్షన్, హేమావతినగర్ చౌరస్తా ప్రాంతాల్లో సైతం ప్రమాదాలు అధికమే. అనంతరం సీతారామయ్య కాంప్లెక్స్ వద్ద ఉన్న వైజంక్షన్ వద్ద ప్రమాదాలు అధికమే. బోరబండకు వెళ్లే రోడ్డులో హేమావతినగర్ చౌరస్తా మరీ ప్రమాదకరంగా మారింది. ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడం ఒక కారణమైతే, వాహనాలు ఎటునుంచి వస్తున్నాయో, ఎటు వెళుతున్నాయో తెలియక ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో రోడ్లు సరిగా లేకపోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. సిగ్నల్స్‌ను ఏర్పాటు చేసి రోడ్ల పరిస్థితిని మెరుగుపరచాలని వారు సూచిస్తున్నారు.

సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలి



డివిజన్‌లోని పలు వై జంక్షన్‌లు, చౌరస్తాల్లో రోజురోజుకూ ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. ఈ ప్రాంతాల్లో ఏ ఒక్కచోట సిగ్నల్స్ లేకపోవడమే ముఖ్యకారణం. ఈ కారణంగా వాహనదారులు తమ ఇష్టారాజ్యంగా వాహనాలను నడపడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో రోడ్లు సైతం ప్రమాదాలకు కారణాలవుతున్నాయి.

\- డి.రాజయ్య, హేమావతినగర్

ట్రాఫిక్ కానిస్టేబుళ్లనైనా నియమించాలి



ఎర్రగడ్డ డివిజన్‌లోని వైజంక్షన్‌లు, చౌరస్తాలు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. నిత్యం వాహనదారులు గాయాలపాలవుతున్నారు. ప్రమాదాలను నివారించాలంటే కనీసం ట్రాఫిక్ కానిస్టేబుళ్లనైనా నియమించాల్సిన అవసరం ఉంది. దీంతో ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది.

\- బి.కిరణ్ కుమార్, ఎర్రగడ్డ



సిద్ధార్థ నగర్ పార్క్ రెనోవేషన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాగంటి

పార్కులను సుందరంగా తీర్చిదిద్దుతాం: గోపీనాథ్

వెంగళరావునగర్, మే18 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలు సేద తీరడానికి, చిన్నారులు ఆడుకోవడానికి ఉద్యానవనాలను అన్ని వసతులతో సుందరంగా తీర్చిదిద్దుతామని, ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పిస్తామని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ అన్నారు. ఆదివారం వెంగళరావునగర్ డివిజన్ సిద్ధార్థనగర్ కాలనీలోని రూ.30 లక్షలతో చేపట్టిన పార్క్ పునఃనిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దేదీప్య, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు విజయ్ కుమార్, విజయ్ బాబు, మధురానగర్ సంక్షేమ సమితి ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివ రావు, ఉపాధ్యక్షుడు మనోహర్ రావు, కోశాధికారి సుష్మ, విశ్వప్రకాశ్, హనుమంత్ రావు, బీఆర్‌ఎస్ నాయకులు వేణు, ఆంజనేయులు యాదవ్,రామ కృష్ణ, వేణు, విజయ్ ముదిరాజ్, అర్జున్,సుశీల్, పవన్ ముదిరాజ్,సాయి రఘు, ఏఈ అవినాష్, వర్కింగ్ ఇనిస్పెక్టర్ శేఖర్ పాల్గొన్నారు.



విజేతలతో సంస్థ ప్రతినిధులు

టై శిక్షణలో 'ఫేమిలియర్ ఫేసెస్' జట్టు విజేత

హైటెక్ సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): ది ఇండస్ ఎంటర్ ప్రైన్యూర్స్ (టై) ఆధ్వర్యంలో గచ్చిబౌలి ఫ్యూజీ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణలో 'ఫేమిలియర్ ఫేసెస్' జట్టు విజేతగా నిలిచినట్టు ఆదివారం టై సంస్థ ప్రతినిధులు తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులకు పారిశ్రామిక వేత్తలుగా ఎలా ఎదగాలి.. విద్య పూర్తయిన వెంటనే యువకులు పరిశ్రమలు ఎలా స్థాపించాలి.. అనే అంశంపై విద్యార్థి దశ నుంచే యువకులు తెలుసుకునేందుకు ఈ శిక్షణ దోహద పడుతుందని అతిథి సుబు ఎం కోటా అన్నారు. శిక్షణ అనంతరం విజేతలుగా నిలిచిన వారు ఢిల్లీలో నిర్వహించే గ్లోబల్ టై ఫైనల్స్‌లో పాల్గొంటారు. నగరంలోని ప్రభుత్వ, అంతర్జాతీయ పాఠశాలకు చెందిన 6 జట్లు మూడు నెలలపాటు మెంటారింగ్, ఒక నెల శిక్షణ అనంతరం తమ ఆవిష్కరణలను ప్రదర్శించాయి. కార్యక్రమంలో టీఈ గ్లోబల్ చైర్మన్ మురళి బుక్కపట్నం, టీఈ నగర అధ్యక్షుడు రాజేష్ పగడాల, టీవైఈ అధ్యక్షుడు సుబ్బరాజు పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు.



గెలుపొందిన నూతన కమిటీ

గాయత్రిహిల్స్ కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం

బంజారాహిల్స్, మే 18 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ డివిజన్ గాయత్రి హిల్స్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం జరగగా, ఈ ఎన్నికల్లో మూడోసారి కొమ్మినేని రాఘవులు అధ్యక్షుడిగా ఎన్నికై సంచలనం సృష్టించారు. మొత్తం 282 ఓట్లు పోల్ కాగా అందులో కొమ్మినేని రాఘవులు 176 ఓట్లు సాధించి 71 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఎం.వీ.సుబ్బారావు అధ్యక్ష పదవిలో 105 ఓట్లు వచ్చాయి. మరో వైపు ప్రధాన కార్యదర్శిగా కీర్తి లీలా రమేష్ 142 ఓటతో గెలుపొందారు. 4 ఓట్ల తేడాతో లీలా రమేష్ గెలవడం విశేషం. జనరల్ సెక్రటరీ పోటీలో 138 ఓట్లతో వి.సుబ్బారావు నాలుగు ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈ కమిటీ రెండేళ్లపాటు పదవిలో ఉంటుందని కమిటీ సభ్యులు తెలియజేశారు.



కాంగ్రెస్ పార్టీ నాయకుడు దివంగత ఎల్దాసరి నారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బస్తీ నాయకులు

బస్తీ అభివృద్ధికి ఎల్దాసరి చేసిన కృషి మరువలేం

పంజాగుట్ట, మే18 (ఆంధ్రజ్యోతి): పంజాగుట్ట బాలాపూర బస్తీ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ నాయకుడు, బస్తీ మాజీ అధ్యక్షుడు ఎల్దాసరి నారాయణ చేసిన సేవలు మరువలేనివని, ఆయన మన మధ్య లేకపోవడం బాధాకరమని కాంగ్రెస్ నాయకులు, బస్తీ నాయకులు అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బస్తీ మాజీ అధ్యక్షుడు ఎల్దాసరి సంతాప సభ ఆదివారం బస్తీలోని కమ్యూనిటీ హాల్ వద్ద జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు. ఇందిరాగాంధీ 1965లో నగరానికి వచ్చిన సందర్భంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన చివరి వరకు అదే పార్టీలో కొనసాగుతూ పార్టీకి సేవలందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు బి.నర్సింగ్ రావు, ప్రధాన కార్యదర్శి జి.మాణిక్ రావు, సలహాదారులు సోమాద్రి రామ్మూర్తి, త్యాగరాజు, కుటుంబ సభ్యులు ఎల్దాసరి శివానంద కుమార్, ప్రసాద్ రావు, సుధాకర్ రావు, బస్తీ వాసులు పాల్గొన్నారు.



సుబుదేంద్రా తీర్థ స్వామితో దిడ్డి రాంబాబు తదితరులు

ఆధ్యాత్మిక చింతనతోనే సమాజంలో శాంతి

బర్కత్‌పుర, మే 18 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆధ్యాత్మిక చింతన పెంపొందినప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందని రాఘవేంద్ర మఠం పీఠాధిపతి సుబుదేంద్రా తీర్థ స్వామి అన్నారు. ఆదివారం బర్కత్‌పురలోని రాఘవేంద్ర స్వామి మఠంలో ఆధునీకీకరించిన పరిమల కల్యాణ మండపాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యాకిషన్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, అనంత్‌పురానిక్, అనిల్, విఠల్‌జోషి, బద్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.





శిల్పారామంలో కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శిస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

మాదాపూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ లోని శిల్పారామంలో ఆదివారం కనువిందు చేసే నృత్యాలు చూపరుల మదిని దోచుకున్నాయి. సంగీత సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఈరోజు నృత్య కిన్నెర మద్దాలి ఉషా గాయత్రీ, శిష్య బృందం "మాతృదేవో భవ" అనే కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శించారు. భమిడి పల్లి నరసింహ మూర్తి సత్య యుగం, కృత యుగం, త్రేతాయుగం, ద్వాపర యుగం, కలియుగంలో మాతృమూర్తులు పార్వతీ దేవి, లీలావతి, సీత, యశోద, వకుళా దేవి మాతృ ప్రేమని కూచిపూడి నృత్య రూపకంలో వివరించారు. కార్యక్రమంలో కళాకారులు వాసవి చౌదరి, రమ్య వేణి, లక్ష్మి, నీరజ, ఆశ్రిత షిండే, యశస్వినీ తన్మయి, సహస్ర, లక్ష్మి వాత్సల్య, రసజ్ఞ, లాస్య ప్రియా, సుభి, చేరిష్య, ఇరా, దీక్షిత తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

వృత్తిని చాలెంజ్‌గా తీసుకుంటే మంచి ఫలితాలు



మాట్లాడుతున్న మాజీ స్పీకర్ మధుసూదనాచారి

బర్కత్‌పుర, మే 18(ఆంధ్రజ్యోతి): వృత్తిని చాలెంజ్‌గా తీసుకునప్పుడే మంచి ఫలితాలు వస్తాయని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. వృత్తిని ఎంచుకునే ముందు ఆ వృత్తిపట్ల ఉన్న అవగాహనను పరిగణలోకి తీసుకోవాలని ఆయన కోరారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సమాచార హక్కు వికాస సమితి గౌరవ అధ్యక్షుడు కాచం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విశ్వంభర పత్రిక మొదటి వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పత్రికలు ప్రధాన పాత్రపోషించాయని, దానిలో 'ఆంధ్రజ్యోతి' పత్రిక నిర్వహించిన పాత్ర అమోఘం అన్నారు. పత్రికలు ప్రజల పక్షాన నిలబడి వారి గొంతుకగా మారాలన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... వాస్తవాలకు జర్నలిజం నిలువుటద్దంగా నిలుస్తుందన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

తెలుగు అక్షరం మీద చలం ప్రభావం



చలం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, మే 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు అక్షరం మీద అంచలంచల ప్రభావం వేసినవాడు చలం అని చలం భావన కన్వీనర్ నాళేశ్వరం శంకరం అన్నారు. ఆదివారం రవీంద్ర భారతిలో జీవ జలం చలం సాహిత్య స్మారకోపన్యాస సభ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డా.నందిని సిధారెడ్డి, డా.నాళేశ్వరం శంకరం ఎన్.మల్లేశ్వరి, నెల్లుట్ల రమాదేవి హాజరై, చలం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ.. చలం రచనలు చేసిన కాలం తరువాత ఎనిమిది దశాబ్దాలు గడిచాక కూడా ఇప్పటికీ చలం రచనల గురించి మాట్లాడుకుంటున్నామంటే ఆ రచనల్లో ఉన్న సార్వకాలీనతను అర్థం చేసుకోవచ్చు అన్నారు.

ఆకట్టుకున్న శేషు పాటల బహార్

చిక్కడపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంగీత ప్రపంచానికి వరం శేషగిరిరావు అని కళాభారతి సిటీ కల్చర్ సెంటర్ అధినేత పురుషోత్తం నారగౌని అన్నారు. 65 సంవత్సరాల వయసులో 12 గంటల పాటు నిర్విరామంగా 120 పాటలు పాడి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం పొందిన గానవిజేత శేషగిరిరావు అని ప్రశంసిస్తూ ఆయనను ఘనంగా సన్మానించారు.

ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని కళాభారతి సిటీకల్చర్ సెంటర్‌లో ఈ రికార్డ్ కార్యక్రమం ఆదివారం భువన సంగీత ఝరి సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. పురుషోత్తం మాట్లాడుతూ శేషగిరిరావు గానం వినోదానికి కాదు వినయానికి ఉదాహరణ అన్నారు. ఆయన పదవిలో ఉన్నప్పుడు ఇరిగేషన్ శాఖ అధికారిగా నీటిని ప్రవహింపచేశారని ఉద్యోగ విరమణ తర్వాత గానం ద్వారా స్వరాన్ని ప్రవహింపచేస్తున్నారన్నారు. ఆయన గానం భావాలకు వేదిక అన్నారు.

ఈ కార్యక్రమంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అధినేత వెంకటాచారి, కార్యక్రమ నిర్వహణాసంస్థ ప్రతినిధి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. శేషు పాటల బహార్ పేరిట ఆకట్టుకునేలా జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు, హిందీపాటలను ఆలపించారు.

యువకుడి మెడలో బంగారు గొలుసు చోరీ

అమీర్‌పేట, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ యువకుడి మెడలో బంగారు గొలుసు చోరీకి గురైంది. ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఒంగోలు జిల్లా కేంద్రానికి చెందిన ఈశ్వర్ వెంకట్ సాయి (19) అత్తాపూర్ హైదర్‌గూడ ఈశ్వర్ థియేటర్ సమీపంలో మిత్రులతో కలిసి ఉంటూ మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్ మేనేజ్‌మెంట్‌లో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 16న చదువు ముగించుకుని సాయంత్రం ఇంటికి వెళుతున్న సమయంలో కళ్యాణ్ నగర్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కి మైత్రీవనం బస్టాప్‌లో దిగాడు. కొద్ది సేపటికి తన మెడలో ఉన్న 12 గ్రాముల బంగారు చైన్ కనిపించలేదు. అప్పటికే బస్సు వెళ్లిపోవడంతో చేసేదేమిలేక ఎస్‌ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇల్లు కట్టాలంటే లంచం ఇవ్వాలి

మహిళను వేధింపులకు గురిచేస్తున్న నలుగురిపై కేసు

యూసుఫ్ గూడ, మే 18 (ఆంధ్రజ్యోతి): సొంత స్థలంలో ఇల్లు నిర్మిస్తుంటే లంచం ఇవ్వాలని కొందరు వేధింపులకు గురిచేస్తున్న సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముషీరాబాద్, మోహన్ నగర్ కు చెందిన శ్రీదేవికి రహమత్‌నగర్‌లో స్థలం ఉంది. ఆమె అక్కడ ఇల్లు నిర్మిస్తుండగా సమీపంలో ఉన్న రమేష్, శ్రీనివాస్, సతీష్, నర్సింగ్ లు ఇంటి నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ అధికారుల పర్మిషన్ కావాలంటే లంచం ఇవ్వాలని నమ్మ బలికారు. శ్రీదేవి ఆ నలుగురికి 2024 మే లో రూ.2 లక్షలు ఇచ్చింది. అయినా వారు వేధింపులు ఆపలేదు. ఆ స్థలంలోని 180 గజాలు తమ పేరుతో రాయాలని, రూ.15 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తుండడంతో శ్రీదేవి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

అద్దె అడిగితే దాడి చేశారు..

యూసుఫ్ గూడ, మే 18 (ఆంధ్రజ్యోతి): ఇంటి అద్దె ఇవ్వాలని అడిగితే దాడి చేసిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్ నగర్‌లో చాటి శివకుమార్ సుజాత ఇంట్లో మమత అద్దెకు దిగారు. ఆమె స్నేహితురాలు సుప్రియ కొన్ని నెలల తరువాత పెంట్ హౌస్‌లో అద్దెకు దిగింది. ఇద్దరు కొన్ని నెలలు అద్దె చెల్లించకుండా, తరువాత ఇస్తామని ఇల్లు ఖాళీ చేశారు. యజమాని అద్దె ఇవ్వాలని అడగడంతో మమత భర్త హేమంత్ దాడికి దిగాడు. శివకుమార్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ఎఫ్‌ఓబీ నుంచి కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, మే 18 (ఆంధ్రజ్యోతి): హుందానగర్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం - 5 వద్దగల ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై నుంచి కిందపడి గుర్తుతెలియని వ్యక్తి తీవ్ర గాయాలతో మృతిచెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ చిన్మయ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం అర్ధరాత్రి 35 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై నుంచి కిందపడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై మృతిచెందాడు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

కనులపండువగా సర్వైశ్వర్య పూజ

బోయినపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లిలోని శబరిమలఅయ్యప్ప తీర్థక్షేత్రంలో సర్వైశ్వర్య పూజ కనుల పండువలా నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆలయంలోని గణపతి, సుబ్రమణ్య స్వామి, ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం చుట్టూ భక్తులు దీపాలను వెలగించారు. ఈ దీపాల కాంతులతోనే పూజా కార్యక్రమాన్ని వేద పండితులు నిర్వహించారు.

ఒకే భవనం.. 2 పోలీస్‌స్టేషన్లు.. 2 ఏసీపీ కార్యాలయాలు..!

- గతంలో స్టోర్ రూం.. ఇప్పుడు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్
- స్థలం సరిపోక కానిస్టేబుళ్ల ఇబ్బందులు

ఖైరతాబాద్, మే18 (ఆంధ్రజ్యోతి): పౌర హక్కులకు భంగం కలిగితే చట్టం ప్రకారం చర్యలు తీసుకునే పోలీసులకే కక్కలేక.. మింగలేక అనే పరిస్థితి నెలకొంది. తమ బాధలను ఉన్నతాధికారులకు చెప్పుకోలేక, ఉన్న వసతులు సరిపోక సతమతమవుతున్నా ఉన్నతస్థాయి అధికారులు పట్టించుకోకపోవడంతో చేసేదేమీలేక ఉన్నంతలో సర్దుకుంటున్నారు. ఖైరతాబాద్ ఐమాక్స్ ఎదురుగా ఉన్న గ్రౌండ్ ప్లస్ టు భవనంలో ఖైరతాబాద్ శాంతి భద్రతల పోలీస్‌స్టేషన్, సైఫాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు పనిచేస్తున్నాయి. దీంతో పాటు సైఫాబాద్ డివిజన్ శాంతిభద్రతల ఏసీపీ కార్యాలయంతో పాటు సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయాలు సైతం ఉన్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పనిచేస్తుండగా మొదటి అంతస్తులో ఇద్దరు ఏసీపీల చాంబర్లు, కార్యాలయాలు ఉన్నాయి. ఇక రెండవ అంతస్తులో సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ల కార్యాలయాలు, ఉండగా ట్రాఫిక్ ఎస్‌ల విశ్రాంతి గదులు ఉన్నాయి. గతంలో స్టోర్ రూంగా ఉన్న ప్రాంతాన్ని ప్రస్తుతం సైఫాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌గా వినియోగిస్తుండడం విశేషం

పాస్‌పోర్టు కార్యాలయాన్ని పోలీస్ స్టేషన్లుగా..

ఐమాక్స్ ఎదురుగా ఉన్న హెచ్‌ఎండీఏ స్థలంలో ప్రభుత్వం జీ ప్లస్ 2 అంతస్తుల్లో ఓ భవనాన్ని నిర్మించింది. పాస్‌పోర్టు వెరిఫికేషన్ కార్యాలయం కోసం దీనిని నిర్మించారు. నిర్మాణం పూర్తయిన కొన్ని సంవత్సరాల వరకు ఇందులో పాస్‌పోర్టు వెరిఫికేషన్ కార్యాలయం నడిచింది. అనంతరం పై అంతస్తులో స్థలం ఖాళీగా ఉండడంతో సైఫాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు దాని పరిధిలో భవనం లేకపోవడంతో పోలీసు ఉన్నతాధికారుల జోక్యంతో సైఫాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీల కార్యాలయాలు ఇందులోకి వచ్చాయి. కొన్ని రోజుల అనంతరం ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ కొత్తగా ఏర్పాటు కావడం, సైఫాబాద్ పరిధి నుండి ఇందులో చేరిన చాలా ప్రాంతాలకు సమీపంలో ఉంటుందని ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించేందుకు పాస్‌పోర్టు కార్యాలయాన్ని తొలగించి ఒక అంతస్తు మొత్తం వినియోగించుకునే ఏర్పాట్లు చేసి కొత్త పీఎస్‌ను ప్రారంభించారు. ఆ తరువాత సైఫాబాద్ డివిజన్ శాంతి భద్రతల విభాగం ఏసీపీ కార్యాలయాన్ని సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ నుండి ఈ భవనానికి మార్చారు. దీంతో ఒకే భవనంలో రెండు పోలీస్ స్టేషన్లు, రెండు ఏసీపీల కార్యాలయాలు నడుస్తుండడంతో ఎస్‌లు, సిబ్బందికి సరిపడా విశ్రాంతి గదులు లేకుండా పోయాయి. ఈ మధ్యే మహిళా పోలీసు సిబ్బందికి విశ్రాంతి గదిని నిర్మించారు. భవనం సెల్లార్‌లో శాంతి భద్రతల పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇనిస్పెక్టర్ కార్యాలయంతో పాటు ఎస్‌ల రెస్ట్ రూం ఉంది. దీంతో పాటు ఉన్న ఒకే గదిలో దాదాపు 200 మందికి పైగా ఉన్న శాంతి భద్రతలు, ట్రాఫిక్ విభాగాల పోలీసు సిబ్బంది సర్దుకొని కాలం వెల్లదీయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇక సైఫాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ గతంలో స్టోర్ రూంగా వినియోగించిన ప్రాంతంలో నడుస్తోంది. స్థలం సరిపోక ఈ గది ముందు భాగంలో వేసిన రేకుల షెడ్డులో పోలీస్‌స్టేషన్ రిసెప్షన్ నడుస్తోంది.



ఖైరతాబాద్ శాంతి భద్రతలు, సైఫాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల భవనం

త్వరలో ట్రాఫిక్ పీఎస్ పరిధి విస్తరణ

ప్రస్తుతం ఉన్న సైఫాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిని మరింత పెంచే ఆలోచనలో అధికారులు ఉన్నారు. నారాయణగూడ, నాంపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధుల్లోని కొన్ని ప్రాంతాలను సైఫాబాద్‌లో కలిపేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. దీంతో మరింత మంది సిబ్బందిని సైఫాబాద్ ట్రాఫిక్ కోసం నియమించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఈ పోలీస్‌స్టేషన్‌కు ఒక ఇనిస్పెక్టర్ ఉండగా ఇటీవలే నారాయణగూడ పీఎస్‌లో ఎస్‌హెచ్‌ఓగా పనిచేసిన మరో అధికారిని అదనపు ఇనిస్పెక్టర్‌గా నియమించారు. ఇప్పుడున్న ఇరుకైన భవనంలోనే రెండవ అంతస్తులో అదనపు ఇన్‌స్పెక్టర్ కోసం చాంబర్ నిర్మిస్తున్నారు. ఇక మరికొంత మంది ఎస్‌ఐలు, సిబ్బంది ఇక్కడకు వస్తే పరిస్థితి ఏంటని అధికారులు, సిబ్బంది హైరానా చెందుతున్నారు.

కంటోన్మెంట్ అభివృద్ధిపై
దృష్టి సారించాలి

- ఎన్నికలు నిర్వహించరు
- బకాయిలు విడుదల చేయరు
- రక్షణ శాఖ తీరుపై స్థానికుల నిర్వేదం



సికింద్రాబాద్, మే 18(ఆంధ్రజ్యోతి): అటు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించరు.. ఇటు అభివృద్ధికి అవసరమైన ప్రత్యేక నిధులు కేటాయించరు.. కనీసం బకాయి పడిన రూ.925 కోట్లలో సగం కూడా చెల్లించరు.. ఇదీ సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పట్ల కేంద్ర రక్షణశాఖ వ్యవహరిస్తున్న తీరు. నగరం నడిబొడ్డున ఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిపాలన అంతా కేంద్ర రక్షణశాఖ కనుసన్నల్లోనే నడుస్తుంది. 8 వార్డులుగా ఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో మూడున్నర లక్షల మేరకు జనాభా ఉంటుంది. ఇక్కడి ప్రజల నుంచి వసూలయ్యే ఆస్తి పన్ను, నీటి పన్ను, బిల్డింగ్ డెవలప్‌మెంట్ చార్జీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భవనాలకు అందించే సేవల ద్వారా వసూలయ్యే సర్వీసు చార్జీలు తదితర రూపాల్లో సమకూరే ఆదాయం ద్వారా బోర్డు నడుస్తుంది. ఇలా వచ్చే ఆదాయం ద్వారానే మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోంది.

మరోవైపు 8 వార్డులకు ప్రతి ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించి వార్డు సభ్యులను, వారిలోంచి ఒకరు ఉపాధ్యక్షునిగా ఎన్నికయ్యే ప్రక్రియను నిర్వహిస్తోంది. ఐదు సంవత్సరాలుగా బోర్డు ఎన్నికలను రక్షణశాఖ నిర్వహించడం లేదు. ఫలితంగా ఆయా వార్డుల పరిధిలోని కాలనీలు, బస్తీల ప్రజల సమస్యలను, విన్నపాలను, అవసరాలను బోర్డు యంత్రాంగం దృష్టికి తీసుకువెళ్లే వెసులుబాటు లేకుండాపోయింది. బోర్డు పాలక మండలి ఎన్నికలు నిర్వహించాల్సిందిగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, పౌరులు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా ప్రయోజనం కలగడం లేదు. కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించినప్పటికీ రక్షణ శాఖ నుంచి స్పందన రావడం లేదు.

సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఆదాయ వనరుల్లో కీలకమైన ఆక్ట్రాయ్‌ను జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత కేంద్రం రద్దు చేసింది. దాంతో బోర్డు ఖజానాపై తీవ్రంగా ప్రభావం పడింది. ఓ దశలో ఉద్యోగుల జీత భత్యాలు కూడా చెల్లించడం గగనంగా మారింది. దీంతో బోర్డు చాలా కష్టాల్లో ఉందని, రూ.150 కోట్లు ప్రత్యేక గ్రాంటు కేటాయించి, ఆదుకోవాలంటూ బోర్డు పాలక మండలి కేంద్ర రక్షణ శాఖకు విజ్ఞప్తి చేసింది. దాంతోపాటు కంటోన్మెంట్ బోర్డుకు రావాల్సిన రూ.925 కోట్ల సర్వీసు చార్జీల్లో సగమైనా చెల్లించాలంటూ విన్నవించింది. అయినా రక్షణశాఖ నుంచి సానుకూల స్పందన రాలేదు. దాంతో అందుబాటులో ఉన్న వనరులతో, కష్టం మీద బోర్డును నడిపిస్తున్నారు. కనీసం ఇప్పటికైనా సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధిపై కేంద్ర రక్షణ శాఖ దృష్టి సారించాలని, ప్రత్యేక గ్రాంటు విడుదల చేయాలని, సర్వీసు చార్జీల బకాయిలు చెల్లించాలని పలువురు కోరుతున్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

బౌద్ధనగర్, మే 18(ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ డివిజన్‌లో పలు ప్రాంతాల్లోని రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. వారాసిగూడ చౌరస్తా నుంచి అంబర్‌నగర్ వెళ్లే ప్రధాన రహదారిపై మార్కండేయ ఆలయానికి కూతవేటు దూరంలో రోడ్లపై గుంతలు పడటంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో విద్యానగర్, దిల్‌సుఖ్‌నగర్, అఫ్జల్‌గంజ్, సికింద్రాబాద్‌తో పాటు పలు ప్రాంతాలకు నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్లు గుంతలు పడటంతో వర్షంనీరు గుంతల్లో నిలిచిపోవడం వల్ల ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవటంలేదని స్థానికులు వాపోతున్నారు. వీటితో పాటు నేతాజీ స్కూల్ మార్గం, వారాసిగూడ పోలీస్‌స్టేషన్ వెనక రోడ్లను సీవరేజీ మరమ్మత్తుల పేరిట తవ్వి వదిలివేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలు పడిన రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


వారాసిగూడ నుంచి అంబర్‌నగర్ వెళ్లే ప్రధానరోడ్డుపై గుంతల్లో నిలిచిన నీరు




ప్రమాదాల బారిన పడుతున్నాం

బౌద్ధనగర్ డివిజన్లో అంబర్‌నగర్ ప్రధానరహదారిపై గుంతలు పడిన రోడ్లకు మరమ్మత్తులు చేపట్టాలి. గుంతలు పడి వర్షపునీరు నిలిచి ఉండటంతో ద్విచక్ర వాహనదారులు అవస్థలు పడటంతో పాటు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మత్తులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

- బచ్చు విజయ్, జామై ఉస్మానియా

కనులపండువగా సర్వైశ్వర్య పూజ

బోయినపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లిలోని శ్రీ శబరిమల అయ్యప్ప తీర్థ క్షేత్రంలో సర్వైశ్వర్య పూజ కన్నుల పండువలా నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆలయంలోని గణపతి, సుబ్రమణ్య స్వామి, ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం చుట్టూ భక్తులు దీపాలను వెలిగించారు. ఈ దీపాల కాంతులతోనే సర్వైశ్వర్య పూజ కార్యక్రమాన్ని వేదమంత్రాల సాక్షిగా వేద పండితులు నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. దీప కాంతుల కిరణాలు స్వామిపై పడుతున్న సమయంలో మహా హారతి కాంతిలో స్వామి వారు భక్తులకు దర్శనం ఇచ్చాడు. అనంతరం ఆలయంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సర్వైశ్వర్య పూజ అంటే అన్ని శుభాలను, ఐశ్వర్యాన్ని ప్రసాదించే పూజ. ఈ పూజ ద్వారా భక్తులు తమ కోరికలను నెరవేర్చుకోవచ్చు. జీవితంలో సంతోషం, ఐశ్వర్యాన్ని పొందవచ్చు అని భక్తులకు బోధించారు.


దీప కాంతులతో భక్తులకు దర్శనం ఇచ్చిన అయ్యప్పస్వామి

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి

చిలకలగూడ, మే 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో భూగర్భ జలాలు రోజురోజుకి అడుగంటిపోయి తీవ్ర నీటి సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి. ఈ నేపథ్యంలో ఇంకుడు గుంతలు నిర్మిస్తే సమస్యను అధిగమించే అవకాశాలు అధికంగా వున్నాయి. గతంలో డివిజన్ పరిధిలో తూతూ మంత్రంగా ఏర్పాటు చేసిన బకటి, రెండు సరైన నిర్వహణ లేక మూసుకుపోయాయి. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఇంకుడు గుంతల నిర్మాణం చేపడితే నీటి సమస్య పరిష్కారానికి దోహదపడతాయి. తార్నాక నుంచి ఆలుగడ్డ బావి, రైల్వే ఆసుపత్రి, మెట్టుగూడ జంక్షన్ తదితర ప్రాంతాలు ఇంకుడు గుంతల నిర్మాణానికి ఎంతో అనుకూలంగా వున్నాయి. వర్షం పడగానే వేగం నీరు కిందికి వచ్చే విధంగా సహజ సిద్ధంగా వున్నాయి. మున్సిపల్ పార్కులు, ఖాళీ స్థలాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపడతే వర్షం నీరు వృథా కాకుండా ఉండటంతో పాటు భూగర్భ జలాలు పెరుగుతాయి. ఈవిధంగా సంబంధిత అధికారులు, పర్యావరణవేత్తలు, రాజకీయ నాయకులు చర్యలు చేపడితే భూగర్భ జలాలు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.


ఇంకుడుగుంత


లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డి తదితరులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

తార్నాక, మే 18 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యం బారిన పడిన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరమని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి అన్నారు. ఇటీవల సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను ఆదివారం తార్నాకలోని క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ మేయర్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ కింద నిరుపేదలకు వైద్య సహాయం అందించి భరోసాను కల్పిస్తుందని, నిరుపేదలను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వినయ్‌కుమార్ తదితరులు

నేడు పుచ్చలపల్లి సుందరయ్య స్మారకోపన్యాస సభ

రాంనగర్, మే 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, స్వాతంత్ర్య సమర యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభను ఈనెల 19న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఎస్వీకే ట్రస్ట్ కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం సుందరయ్య కళానిలయంలో సుందరయ్య స్మారకోపన్యాస సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. 1987లో సుందరయ్య విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కేంద్రం నుంచి పేదలు, కార్మికులకు విద్య, వైద్యం, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనకు కృషి చేసిందన్నారు. 19వ తేదీన సాయంత్రం ఎస్వీకేలో సుందరయ్య స్మారకోపన్యాసం సందర్భంగా నేటి రాజకీయాలు-షహీద్ భగత్‌సింగ్ చరిత్రపై ప్రొఫెసర్ చమన్‌లాల్ ప్రసంగించనన్నారని తెలిపారు. దీనికి సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, సీపీఎం నేతలు తమ్మినేని వీరభద్రం, బుచ్చిరెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో నేతలు భూపతి వెంకటేశ్వర్లు, రమణరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి కృషి



బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న భానుక నర్మద

తిరుమలగిరి మే 18 (ఆంధ్రజ్యోతి): రాబోయే వర్షాకాలంలో ప్రమాదాలు జరుగకుండా నియంత్రించడానికి గుంతలమయమైన రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని కంటోన్మెంటు బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద అన్నారు. ఆదివారం కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వార్డు 7లో కంటోన్మెంటు బోర్డు నిధులు రూ.45లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. లాల్‌బజార్ చౌరస్తా నుంచి అంబేద్కర్ స్తూపం లాల్‌బజార్ మార్కెట్ వరకు మరో రోడ్డు నిర్మాణం, తిరుమలగిరి సబ్‌స్టేషన్ నుంచి గన్‌రాక్ పంప్‌హౌజ్ వరకు బీటి రోడ్డు అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే నెల రోజుల్లో వార్డులో నెలకొన్న సమస్యలు ముఖ్యంగా డ్రైనేజీ, కాలనీలో అంతర్గత బీటి రోడ్ల నిర్మాణం వంటి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

కంటోన్మెంట్‌కు రావాల్సిన నిధులు రూ.303 కోట్లు తీసుకురావడంలో స్థానిక పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ కృషి గొప్పది అన్నారు. ఈ నిధులతో కంటోన్మెంట్ బోర్డు వ్యాప్తంగా ఉన్న సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆమె తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ నగర్ నాగేందర్, వైవీ రావు, మల్లిఖార్జున్, సాయి కుమార్, సురేష్, సామల రాఘవ రెడ్డి, వార్డ్ అధ్యక్షులు, బీజేపి సీనియర్ నాయకులు పవన్ కుమార్, ప్రశాంత్, జేవి నర్సింగ, ఉదయ్, శ్రీధర్ రెడ్డి, అర్జున్ యాదవ్, బట్టు శ్రీనివాస్, బీఎం రాజేష్, అనిల్, మల్లేష్, విశ్వంత్, సంజీవ్, మహేందర్, శేఖర్, రాజు, సంతోష్, రఘు, శ్రీకాంత్, చందు, శ్రీనివాస్, ధామస్, జాన్సన్, లింగం తదితరులు పాల్గొన్నారు.


చలం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు

తెలుగు అక్షరం మీద చలం ప్రభావం

రవీంద్రభారతి, మే 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు అక్షరం మీద అంచలంచల ప్రభావం వేసినవాడు చలం అని చలం భావన కన్వీనర్ నాశేశ్వరం శంకరం అన్నారు. ఆదివారం రవీంద్ర భారతిలో జీవ జలం చలం సాహిత్య స్మారకోపన్యాస సభ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డా.నందిని సిధారెడ్డి, డా.నాశేశ్వరం శంకరం ఎన్. మల్లేశ్వరి, నెల్లుట్ల రమాదేవి హాజరై, చలం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ.. చలం రచనలు చేసిన కాలం తరువాత ఎనిమిది దశాబ్దాలు గడిచాక కూడా ఇప్పటికీ చలం రచనల గురించి మాట్లాడుకుంటున్నామంటే ఆ రచనల్లో ఉన్న సార్వకాలీనతను అర్థం చేసుకోవచ్చు అన్నారు.


కేశవనగర్‌లో నిర్వహించిన స్వచ్ఛతా కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ కమిషనర్ శైలజ, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

కేశవ్‌నగర్‌లో స్వచ్ఛతా కార్యక్రమం

ఉప్పల్, మే 18 (ఆంధ్రజ్యోతి): బోడుప్పల్ నగరపాలక సంస్థ కేశవ నగర్ కాలనీలో ఆదివారం "స్వచ్ఛ కేశవ నగర్" కార్యక్రమాన్ని నిర్వహించింది. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ శైలజ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు ఆమె తెలిపారు.

విజ్ఞానాన్ని పంచుతున్న అల్వాల్ గ్రంథాలయం

- అల్వాల్ గ్రంథాలయానికి పెరుగుతున్న పాఠకుల ఆదరణ

అల్వాల్, మే 18 (ఆంధ్రజ్యోతి): అల్వాల్ గ్రంథాయలం విజ్ఞాన భండాగారంగా పాఠకుల ఆదరణ చూరగగొంటుంది. గ్రంథాయలం నిత్యం పాఠకులతో కిటకిటలాడుతుంది. అల్వాల్ ప్రాంత ప్రజలే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానాన్ని వినోదాన్ని పొందుతున్నారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలకు చెందిన వివిధ దిన పత్రికలు, ఆయా జిల్లాల ఎడిషన్లతో పాటు అనేక వార, పక్ష, మాస పత్రికలు ఈ లైబ్రరీలో పాఠకులకు అందుబాటులో ఉన్నాయి. పదమూడు దిన పత్రికలు, 18 వార పత్రికలు, 8 పక్ష పత్రికలు, 24 మాస పత్రికలతో పాటు 21,896 పుస్తకాలు ప్రస్తుతం లైబ్రరీలో అందుబాటులో ఉన్నాయి. ఉన్నత చదువులు చదివే సంబంధిత పుస్తకాలతో పాటు బ్యాంక్, టెట్, పోలీస్, గ్రూప్-1, గ్రూప్-2, సివిల్‌తో సహా వివిధ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లు పరీక్షలకు రాసే వారికి ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. అల్వాల్‌లోని ఓల్డ్ అల్వాల్‌లో ఉన్న గ్రంథాలయానికి 59 ఏళ్ల చరిత్ర ఉంది. జంటనగరాలలోనే పురాతనమైన గ్రంథాలయంగా అల్వాల్ గ్రంథాలయానికి పేరుంది. సుమారు 600 గజాల స్థలంలో 1966లో గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఉద్యోగులు, విద్యార్థులు, సినియర్ సిటిజన్లు, వృద్ధులు, మహిళలు గ్రం థాలయానికి పాఠకులుగా ప్రతి రోజు వస్తారు.

రూ.100 లకే శాశ్వతం సభ్యత్వం

ఇప్పటి వరకు 1706 మంది పాఠకులు ఈ లైబ్రరీలో సభ్యత్వం తీసుకున్నారు. వారిలో 954 మంది పురుషులు, 752 మహిళలున్నారు. కేవలం వంద రూపాయలు కడితే శాశ్వత సభ్యత్వం ఇస్తున్నారు. విలువైన పుస్తకాలను ఇంటికి తీసుకువెళ్లే వెలుసుబాటు సైతం కల్పిస్తున్నారు. రోజు ఉదయం 8.30 గంటల నుంచి 11 గంటల వరకు తిరిగి సాయంత్రం 4 గంటలనుంచి రాత్రి 7 గంటల వరకు గ్రంథాలయం తెరిచి ఉంటుంది.

- కొన్ని కంప్యూటర్లను ఏర్పాటు చేస్తే అన్ని రకాలు పుస్తకాలు, వివిధ రకాల గ్రంథాలు, వార్తా పత్రికలను ఈ-లైబ్రరీలో చదువుకునే అవకాశం ఉంటుంది. అయితే స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు తోడ్పాటు నందించి ఈ-లైబ్రరీ ఏర్పాటు చేస్తే మరింత బాగుంటుంది.

అన్ని రకాల పుస్తకాలున్నాయి

అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. కేవలం వంద రూపాయలు తీసుకుని శాశ్వత సభ్యత్వాన్ని ఇస్తున్నాం. విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, సీనియర్ సిటిజన్స్ ఇక్కడ వివిధ పుస్తకాలు చదువుకుంటున్నారు. ఇటీవలనే కొత్త భవనం అందుబాటులోకి వచ్చింది. కంప్యూటీకరణ, ఆధునీకరణమైన ఫర్నీచర్ సదుపాయలనే కల్పించే అవశముంది. ప్రసుత్తం టెలికాం కాలనీ, యాప్రాల్, కౌకూర్, పాదర్‌బాలయ్యనగర్, టెంపుల్ అల్వాల్, త్రిశూల్ పార్క్‌లో ఈ లైబ్రరీ కేంద్రాలు ఉన్నాయి.

- శివకుమార్, ఇన్‌చార్జి గ్రంథాపాలకుడు

బయట దొరకని పుస్తకాలు లభిస్తాయి

ఈ-లైబ్రరీని ఏర్పాటు చేస్తే యువత, పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు ఎంతో ఉపయోగపడే అవకాశముంది. చిన్నారులను అలరించడానికి కామిక్ పుస్తకాలు, కథల పుస్తకాలు అందుబాటులో ఉంచారు. వీటితో పాటు వివిధ కార్టున్ బొమ్మలతో కూడిన పుస్తకాలు, పజిల్స్ పుస్తకాలు పడితే బాగుంటుంది.

- బస్వరాజ్, పాఠకుడు

సరస్వతీ శిశుమందిర్ ప్రహరీ కూల్చివేత


ఆందోళన చేపట్టిన సరస్వతీ శిశుమందిర్ పాఠశాల కమిటీ ప్రతినిధులు, బీజేపీ నాయకులు

- పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న వివాదం

కుషాయిగూడ, మే 18 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో నడుస్తున్న కుషాయిగూడలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలను ప్రహరీని ఆదివారం ఉదయం కొందరు వ్యక్తులు కూల్చివేశారు. కొన్నేళ్ల క్రితమే పెద్దల సమక్షంలో హద్దులను నిర్ణయించి ఇటు పాఠశాలకు, అటు అమ్మవారి దేవాలయానికి స్థలం కేటాయింపు జరిగిందని, కొందరు వ్యక్తులు వివాదం సృష్టించేందుకే ఈ కూల్చివేతలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు కొద్దిసేపు ఆందోళన నిర్వహించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకోవడంతో వివాదం కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది. ఆలయానికి సంబంధించిన వ్యక్తులు ప్రహరీని కూల్చివేసినట్లు సరస్వతీ శిశుమందిర్ పాఠశాల యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలను సైతం అందజేసినట్లు సమాచారం. ఇరు వర్గాలను పిలిపించి పోలీసులు విచారణ చేపట్టారు.


సరస్వతీ శిశుమందిర్ పాఠశాల ప్రహరీని కూల్చివేసిన దృశ్యం

నేడు ఫీజుల నియంత్రణపై సమావేశం

అడ్డగుట్ట, మే 18 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజు నియంత్రణకై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి సిహెచ్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ స్కూళ్లు అధిక ఫీజులను వసూలు చేస్తున్నాయని, ఫీజుల నియంత్ర విషయంలో ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు. ఫీజు నియంత్రణపై సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విద్యా సంస్థలు, ఎంవీ ఫౌండేషన్, బాలల హక్కుల పరిరక్షణ వేదికలతో పాటు ఇతర సంస్థల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 11 గంటలకు రౌండ్ టేబుల్ మీడియా సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో విద్యా విశ్లేషకులు, విద్యార్థులు, ప్రతినిధులు, ప్రజా సంఘాలు సామాజిక కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు.


అన్నపూర్ణసహిత కాశీవిశ్వనాథ ఆలయ రాజగోపుర ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే మర్రి

వైభవంగా రాజగోపుర ప్రతిష్ఠాపన

- హాజరైన ఎమ్మెల్యే మర్రి

మల్కాజ్‌గిరి, మే 18 (ఆంధ్రజ్యోతి): మల్కాజ్‌గిరి ఓల్డ్ నేరేడ్‌మెట్ ప్రధాన రహదారి పక్కన ఉన్న శ్రీ అన్నపూర్ణ సహిత కాశీవిశ్వనాథ ఆలయ రాజగోపుర ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా కొనసాగుతుంది. శ్రీ తాండవకాశీక్షేత్ర పీఠాధీశ్వరులు సచ్చిదానంద సరస్వతీ స్వామిజీ ఆధ్వర్యంలో రాజగోపుర, శిఖర ప్రతిష్ఠ, సతీసమేత నవగ్రహా దేవతావిగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని రెండు రోజులుగా ప్రత్యేక పూజలతో నిర్వహిస్తున్నారు. ఆదివారం మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర రెడ్డి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేను శాలువాతో స్వామివారి ఉత్తరీయంతో సన్మానించారు. మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, ఏకే మురుగేష్, నాయకులు అమీనుద్దీన్, శేఖర్ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ బీవీ వెంకట్రావు, రాజారావు, రమేష్, రాజు, కృష్ణ, గణేష్, సువర్ణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


తాగునీటి సరఫరాలో క్లోరిన్ మోతాదును పరిశీలిస్తున్న జలమండలి అధికారులు

తాగునీటి సరఫరాలో క్లోరిన్ శాతం పరిశీలన

ముషీరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్‌లోని పద్మశాలీ కాలనీలో జలమండలి అధికారులు ఆదివారం ఇంటింటికీ వెళ్లి మంచి నీటి సరఫరాలో క్లోరిన్ శాతాన్ని పరిశీలించారు. ప్రజలకు మెరుగైన మంచినీటిని అందించేందుకు పరిశీలిస్తామని జలమండలి డీజీఎం కార్తిక్ రెడ్డి తెలిపారు. కలుషిత నీటి సరఫరాను పూర్తిగా నిర్మూలించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి సిబ్బంది గోపి, నరేష్, పద్మశాలీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఆంజనేయులు, సుందర్‌పటాలే పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాధినేని వెంకటేశ్వరరావు చిత్రంలో చలపతిరావు, గోవర్ధన్

మావోలతో చర్చలు జరపాలి

రాంనగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపి వేసి మావోలతో శాంతి చర్చలను జరపాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర కమిటీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జేవీ చలపతిరావు, సాధినేని వెంకటేశ్వర్‌రావు, గోవర్ధన్ మాట్లాడారు. భారత్, పాక్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అటవీ ప్రాంతాల్లో కాల్పుల విరమణకు స్వస్తి పలికి మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్‌చేశారు. సాయుధ పోలీసులను క్యాంపుల నుంచి సత్వరమే తరలించాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులపై కాల్పుల పేరుతో హత్యలు చేయడం దుర్మార్గమని ఆరోపించారు. కర్రె గుట్ట నుంచి సాయుధ పోలీసులు వెనక్కిరావాలని డిమాండ్ చేశారు. కగార్‌ను వ్యతిరేకిస్తూ ఈనెల 24 వరకు శాంతియుత కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు.

యువతి అదృశ్యం


రాధికాదేవి

బిట్స్‌పిలానీ, మే 18 (ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని అరుంధతీనగర్‌కు చెందిన వివాహిత యువతి అదృశ్యం అయిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. సీఐ సైదయ్య కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని గోరక్‌పూర్ గ్రామానికి చెందిన శివకుమార్ నిషాద్ అతని భార్య రాధికా దేవి(22)లు అనుంధతీనగర్‌లో సంవత్సర కాలంగా కూలీ పనులు చేసుకొంటూ జీవిస్తున్నారు. ఈ నెల 17 తేదీన ఉదయం శివకుమార్ కూలీ పనుల కోసం బయటకు వెళ్లాడు. భోజనానికి మధ్యాహ్నం ఇంటికి వచ్చే సరికి రాధిక కనిపించలేదు. రాధికకు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. బంధువులు, పుట్టింటి వాళ్లకు ఫోన్ చేసి వెతికినా ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో భర్త శివకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.